కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -178 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 10-07-2026 | శుక్రవారం | పేజీలు : 4

# ఆంబోతుల్లా అడ్డుకుంటారా?




**న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్):** బీఆర్ఎస్ పార్టీకి దమ్ముంటే ప్రజా సమస్యలపై పోరాటంలో మాతో పోటీ పడాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చాలెంజ్ చేశారు. నేను పార్టీ పెట్టుకుంటే ఎలాంటి భయం లేదని చెప్పిన బీఆర్ఎస్.. ఇప్పుడు ఎందుకు చాటుమాటుగా ఈసీకి ఫిర్యాదులు చేస్తోందని ప్రశ్నించారు. మా పార్టీకి సంబంధించిన న్యూస్ కవరేజ్ చేస్తున్న పత్రికలు, టీవీలకు హరీశ్ రావు, కేటీఆర్ ఫోన్ చేసి అడ్డుకుంటున్నారని ఇంత సిగ్గులేని వ్యవహారం ఎందుకని నిలదీశారు. ఓ ఆడబిడ్డగా ప్రజల మధ్యకు నేను ధైర్యం వెళ్తుంటే ఆంబోతుల్లా.. అడ్డగాడిదల్లా నా కాళ్లలో ఎందుకు కట్టెలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన కవిత.. ఏనాటికైనా నేను తిరిగి బీఆర్ఎస్ లోకి వస్తానని చాటుమాటుగా ఆ పార్టీ నేతలు చెబుతున్నారని కానీ నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు మళ్లీ బీఆర్ఎస్ లో నేను కలిసేది లేదు ఆ పార్టీతో జతకట్టేదే లేదని స్పష్టం చేశారు.

మిగతాది 2 లో..

- కేటీఆర్‌పై ఘాటు విమర్శలు
- హరీశ్‌పై తీవ్ర ఆరోపణలు
- బీఆర్ఎస్‌లోకి వెళ్లను
- ఈసీ ఫిర్యాదులపై ఫైర్
- రూ.1400 కోట్లపై విచారణ
- ఫీనిక్స్‌పై ప్రశ్నల వర్షం
- సింగరేణి కోసం దీక్ష
- 20 నుంచి రామగుండంలో దీక్ష

# నిరుద్యోగులకు బిగ్ అలర్ట్

## ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టులకు లైన్ క్లియర్




# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్కార్ కీలక ప్రకటన




- ఆగస్టు 15లోపు నిధుల విడుదల
- హైకోర్టుకు సర్కార్ హామీ
- 2, 3, 4వ సంవత్సరం వారికి లబ్ధి


# భగీరథ్‌కు హైకోర్టు బెయిల్ పోక్సో కేసులో ఊరట

- షరతులతో విడుదలకు అనుమతి
- రెగ్యులర్ బెయిల్ మంజూరు
- 49 రోజుల తర్వాత ఊరట
- రూ.1 లక్ష పూచీకత్తు




**న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్):** రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించిన పోక్సో కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథకు లీగల్ పరంగా పెద్ద ఉపశమనం లభించింది. భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు గురువారం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు విన్న అనంతరం హైకోర్టు తుది తీర్పును ప్రకటించారు. రూ.1 లక్ష చొప్పున రెండు వ్యక్తిగత పూచీకత్తులు సమర్పించాలని, కోర్టు విధించిన నిబంధనలకు కట్టుబడి ఉండాలని ఆదేశిస్తూ భగీరథ్‌కు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేశారు.

# మహారాష్ట్రను వణికించిన వరుస ప్రకంపనలు




- మరాఠ్వాడలో వరుస ప్రకంపనలు
- 4.6 తీవ్రతతో భూకంపం
- ఉలిక్కిపడ్డ మూడు జిల్లాలు
- ఇళ్ల నుంచి పరుగులు
- 10 నిమిషాల్లో మరో ప్రకంపన
- ప్రాణనష్టం లేదన్న అధికారులు


# పవన్ కల్యాణ్‌కు చికిత్స

## నేడు ముంబైకి ఏపీ డిప్యూటీ సీఎం




- భుజానికి శస్త్రచికిత్స
- కోకిలాబెన్‌లో వైద్యం
- రొటేటర్ కఫ్ గాయం
- వైద్యుల సూచనతో చికిత్స
- కొద్ది రోజులు విశ్రాంతి
- అధికారిక కార్యక్రమాలకు విరామం

# దమ్ముంటే గెలిచి మంత్రి అవ్వు!




- కడియానికి సురేఖ కౌంటర్
- మంత్రి పదవిపై సవాల్
- టీపీసీసీకి ఫిర్యాదు
- కడియంపై తీవ్ర ఆగ్రహం
- రివ్యూ సమావేశంపై వివాదం

**న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్):** తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య వివాదం ముదురుతోంది. పరస్పర విమర్శలతో సిట్యుయేషన్ మరింత పీక్స్ కు చేరుకుంటోంది. తాజాగా కడియం శ్రీహరికి మంత్రి కొండా సురేఖ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మొదటి నుంచి కడియం శ్రీహరి బుద్ధి ఇలాగే ఉంటుందని గతంలో మంత్రిగా పని చేసిన ఆయన ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యేగా ఇమడలేకపోతున్నట్లైతే పదవికి రాజీనామా చేసి నోర్మూసుకుని ఇంట్లోనైనా కూర్చోవాలని లేదంటే దమ్ముంటే మళ్లీ గెలిచి మంత్రి పదవి తెచ్చుకోవాలన్నారు. అంతే తప్ప నన్ను బ్లేమ్ చేయాలనుకున్నా జిల్లాను డిస్టర్బ్ చేయాలనుకున్నా ఊరుకోనని హెచ్చరించారు. తన శాఖకు సంబంధించిన దేవాదాయ అంశాలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏకపక్షంగా సమీక్షా సమావేశం నిర్వహించడంపై ఇవాళ కొండా సురేఖ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన మంత్రి.. శ్రీహరి 40 ఏళ్ల రాజకీయ అనుభవం 15 ఏళ్ల మంత్రి పదవి అనుభం కలిగిన కడియం శ్రీహరికి రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అన్ని తెలిస్తే తాను చేసింది తప్పు అని ఒప్పుకోవాల్సింది పోయి నాపై ఎదురు దాడికి దిగడం కరెక్ట్ కాదన్నారు. కడియంతో తాడోపేడో తేల్చుకుంటానన్నారు.

# యూజీసీ-నెట్ లీక్ ఆరోపణలు

## రాహుల్ గాంధీ సంచలన ట్వీట్

- 90% ప్రశ్నలు ఒకేలా?
- రూ.2.25 లక్షలకు విక్రయం?
- ఎన్టీఏపై తీవ్ర విమర్శలు




# కాంగ్రెస్ పని అయిపోయింది

- 78 సీట్లు బీఆర్ఎస్‌కే: కేటీఆర్
- సీఎం సర్వేపై కేటీఆర్ వ్యాఖ్యలు
- ప్రజా వ్యతిరేకత స్పష్టమని వ్యాఖ్య
- సర్వేలతో కాంగ్రెస్‌కు షాక్
- రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు




**న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్):** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ పతనం దాదాపు ఖాయమైపోయిందని, రాష్ట్రంలో ఆ పార్టీ పని ఇక అయిపోయినట్లేనని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ జిల్లా పార్టీ నేతలతో జరిగిన ముఖ్యమైన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సగం పదవీ కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే తన పరిపాలన, నాయకత్వంపై ఒక విస్తృతమైన సొంత సర్వే చేయించుకున్నారని కేటీఆర్ వెల్లడించారు. ఆ సర్వేలో ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత చాలా స్పష్టంగా వ్యక్తమైందని ఆయన పేర్కొన్నారు.

# కాళేశ్వరంపై మాటల యుద్ధం

## కేటీఆర్, హరీశ్‌కు పొంగులేటి కౌంటర్




# 53 లక్షల టన్నులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- కొనుగోళ్లలో సర్కార్ వైఫల్యం
- రైతులకు అండగా కేంద్రం
- రాష్ట్రంపై కిషన్ ఫైర్
- గోదాంల కొరతపై ఆందోళన
- ఎఫ్‌సీఐకి అప్పగింతలు నత్తనడకన
- రైతు సమస్యలపై కేంద్రం సీరియస్

2 లో

# ఆంబోతుల్లా అడ్డుకుంటారా?

మొదటి పేజీ తరువాయి

పార్టీ పేరు ఏదైనా ప్రజల ఆశీర్వాదం ఉండాలి:

మా పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన అని మేము పెట్టుకున్నది కాదని ఈసీ మాకు పంపిన ఐదు పేర్లలో వచ్చిందేనన్నారు. ఈ పేరును పోగొట్టేందుకు బీఆర్ఎస్ చాలా ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. అయితే దేవుడు, న్యాయం నా పక్షాన ఉందని అంతిమంగా విజయం నాదే అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఏ పేరు వచ్చినా ప్రజల ఆశీర్వాదం ఉండాలన్నారు. నేను అడిగి ప్రశ్నలకు నేను కేటీఆర్, హరీశ్ రావుపై చేసిన ఆరోపణలకు బీఆర్ఎస్ ఇప్పటి వరకు ఎందుకు సమాధానం చెప్పలేని ప్రశ్నించారు. తల్లీ, చెల్లి అనే సంస్కారం లేకుండా అడ్డమైన కామెంట్స్ చేస్తే చూస్తూఊరుకోమని బీఆర్ఎస్ సోషల్ మీడియాను హెచ్చరించారు. దమ్ముంటే ముఖం చూయించి మాట్లాడాలని బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఉన్నది ఎవరో తమకు తెలుసన్నారు. అతి చేస్తే కాళ్లు విరగొడతామని వార్నింగ్ ఇచ్చారు. ఇటీవలే కేటీఆర్ రూ.188 కోట్లతో ఓ ఇంగ్లీశ్ న్యూస్ పేపర్ ను కొనుగోలు చేశారని ఆరోపించారు. ప్రజల మెచ్చితే అధికారంలోకి వస్తామని ప్రతిపక్షంలో ఉంటే అధికారం లేదని ఇంట్లో ఉండబోమన్నారు.

ఆ పార్టీ జన్మలో బాగుపడదు:

బీఆర్ఎస్ పార్టీని జోడెద్దుల్లా నడపాల్సిన కేటీఆర్, హరీశ్ రావు దున్నపోతుల్లా ప్రజల సమస్యలను మర్చిపోయి అవినీతి అంశాలు అవినీతి పరులను కాపాడటమే పనిగా పెట్టుకున్నారని కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. నేను ఉద్యమాకారుల గురించి మొన్న పోరాటం చేస్తే నన్ను ఆపడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి డ్రామా చేశారన్నారు. నన్ను ఆపడానికి అవసరం అయితే కాంగ్రెస్, అవసరం అయితే బీజేపీతో జతకట్టడం ఏంటి పార్టీకి ఓ విధానం ఉండదా అని నిలదీశారు. ఎవరి వల్ల అవినీతి జరిగిందో ఆ గుంటనక్కను ముందు పెడుతున్న బీఆర్ఎస్ ఈ జన్మలో బాగుపడదని అధికారంలోకి రాదన్నారు. కేసీఆర్?కు అవినీతి మరకలు అంటించింది సరిపోవడం లేదని మరో మూడు నెలలు ఇరిగేషన్ మంత్రి అడుగుతున్నావా అని హరీశ్ రావును ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి అవినీతి మరక అంటడానికి, కాళేశ్వరంలోపూర్తిగా అవినీతికి కారణం హరీశ్ రావు అని ఆరోపించారు.

బీఆర్ఎస్ ఖాతాలో అవినీతి సొమ్ము:

బీఆర్ఎస్ పార్టీ బ్యాంకు ఖాతాలోఉన్న రూ.1400 కోట్లు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చాయని ఆ నిధులపై విచారణ జరిపి ఉద్యమకారులు, అమలవీరుల కుటుంబాలకు పంచాలని కవిత డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రజల ఆస్తి రూ. 800 కోట్లు ఫీనిక్స్ అనే సంస్థను పెంచి పోషించింది కేటీఆర్, హరీశ్ రావు కాదా అని నిలదీశారు. ఎవడు వాడు ఫీనిక్స్ వాడు.. తెలంగాణోడా.. ఆంధ్రోడా? ఎందుకని అతనికి తెలంగాణ భూములను అతనికి పంచిపెడుతున్నారు. బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే ఇప్పుడున్న ప్రభుత్వం డోర్లు తెరిచి అదే అవినీతి కొనసాగిస్తోందన్నారు. జాతీయ పార్టీలకు తెలంగాణ, ఆంధ్ర అనే ఫీలింగ్ ఎందుకు ఉంటుంది? తెలంగాణ భూములు కాపాడాలనే ఆలోచన ఆ పార్టీలకు ఎందుకు ఉంటుందన్నారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున 33 లక్షల టన్నుల కలపను ఫీనిక్స్ సంస్థ కొట్టేస్తే కేవలం 10 కేసులు పెట్టి ఊరుకున్నారన్నారు. మేము అధికారంలోకి వచ్చాక కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు ఇచ్చిన తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం, ధార్మిక భూములన్నింటిపై రివ్యూ చేసి కక్కిస్తామన్నారు.

ఈనెల 20 నుంచి రామగుండంలో నిరవధిక దీక్ష:

సింగరేణి బాయి బాటలో భాగంగా కార్మికులతో మమేకమవుతున్నట్లు కవిత చెప్పారు. సింగరేణిలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలన్నారు. తెలంగాణ హక్కుగా ఉన్న బొగ్గు బ్లాక్‌లు కేంద్రంలోని బీజేపీ వైఖరి వల్ల ప్రైవేట్‌పరం అవుతున్నాయని కవిత విమర్శించారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం డిపెండెంట్లపై స్పష్టత ఇవ్వకపోతే ఈనెల 20 నుంచి రామగుండంలో నిరవధిక దీక్ష చేపట్టి తీరుతామని స్పష్టం చేశారు.

# దమ్ముంటే గెలిచి మంత్రి అవ్వు!

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ బిడ్డను కాంగ్రెస్ ఎంపీ చేశారు:

శ్రీహరి తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేను అని చెప్పుకుంటూ బిడ్డను మాత్రం కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిపించుకున్నారని నిజంగా ఆయనకు విలువలు ఉంటే రాజీనామా చేసి గెలవాలన్నారు. గతంలో నేను పార్టీ మారినప్పుడు నా భర్త కొండా మురళి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. ప్రతిపక్షాల చేతికి ఆయుధం ఇవ్వకూడదనే ప్రభుత్వం, పార్టీపై మచ్చరాకూడదనే తాను రియాక్ట్ అయ్యానన్నారు. తన ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. మీనాక్షి నటరాజన్ కూడా ఈ నెల 14న రాష్ట్రానికి రాబోతున్నానని అప్పుడు మాట్లాడుదామని చెప్పారన్నారు. ఇలాంటివి పార్టీ ప్రతిష్టకు దెబ్బతీస్తాయని అందువల్లే ఆదిలోనే అడ్డుకునేందుకు తాను మాట్లాడుతున్నానన్నారు.

పీఆర్వో మినిట్స్ లోనే ఉంది:

దేవాదాయ శాఖ అధికారులతో కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించినట్లు ఆయన పీఆర్వో ప్రెస్ కు రిలీజ్ చేసిన మినిట్స్ లోనే స్పష్టంగా పేర్కొన్నారని కొండాసురేఖ ఆరోపించారు. కార్యాలయంలో అధికారులతో గంటన్న సేపు సమీక్ష నిర్వహించి ఆలయాల భూములు కాపాడాలని, ఆలయాలకు డీపీఆర్?లు సిద్ధం చేసి ఒక నెలరోజుల్లో సమర్పించాలని కమిషనర్?ను ఆదేశించినట్లు ప్రెస్ కు రిలీజ్ చేశారన్నారు. కమిషనర్ చాంబర్ లో ఇదంతా జరిగి ఉంటే నేను ఎలాంటి అభ్యంతరం చెప్పే దాన్ని కాదు. కానీ మీటింగ్ హాల్?లో మంత్రి, కమిషనర్ కూల్చునే స్థలంలో ఆయన కూర్చుని ముందు స్టాఫ్ ను కూర్చొబెట్టుకుని నేను ఆదేశాలు ఇచ్చానని చెబితే ఏ రకమైన సంకేతాలు వెళ్తున్నాయన్నారు. మినిస్టర్ స్థాయిలో రివ్యూ తీసుకునే అర్థం వెళ్తోందనే అభ్యంతరం చెప్పాను తప్ప నేను ఆ కార్యాలయానికి వెళ్లొద్దని అనడం లేదన్నారు. సామాన్య కార్యకర్త కూడా కమిషనర్ వద్దకు కాదు ముఖ్యమంత్రి వద్దకు వెళ్లొచ్చన్నారు. కమిషనర్?లో చాంబర్?లో కాకుండా మీటింగ్ హాల్?లో రివ్యూ చేసిందే కాకుండా మళ్లీ మామీదే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. శ్రీహరి రాకముదు పార్టీలో అంతా సవ్యంగా ఉందని ఆయన రావడంతోనే ఇవ్వన్నీ జరుగుతున్నాయన్నారు.

# యూజీసీ-నెట్ లీక్ ఆరోపణలు

## రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్): లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఇటీవల జరిగిన యూజీసి – ఎన్ఈటీ పరీక్షపై సంచలన ఆరోపణలు చేశారు. పరీక్షా పత్రం లీక్ అయ్యిందని, దీని వెనుక పెద్ద కుంభకోణం ఉందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా విద్యార్థి లోకంలో, రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలాన్ని రేపుతున్నాయి. ఈ పరీక్షా పత్రం లీక్ ఘటనపై తన ఆవేదనను, ఆగ్రహాన్ని వ్యక్తపరుస్తూ రాహుల్ గాంధీ ట్విట్టర్ వేదికగా కొన్ని కీలక విషయాలను బయటపెట్టారు. సోషియాలజీ సబ్జెక్టుకు సంబంధించిన 100 పేజీల పిడిఎఫ్ డాక్యుమెంట్ పరీక్షకు ముందే బయటకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అతి కట్టుదిట్టమైన భద్రత మధ్య, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వద్ద అత్యంత గోప్యంగా ఉండాల్సిన ప్రశ్నాపత్రం బయటకు ఎలా వచ్చిందని ఆయన నిలదీశారు. లీక్ అయిన ఆ డాక్యుమెంట్‌లో ఉన్న ప్రశ్నలలో ఏకంగా 90 శాతం ప్రశ్నలు అసలైన పరీక్ష ప్రశ్నాపత్రంలో ఉన్న ప్రశ్నలతో సరిపోలడం గమనార్హమని ఆయన వివరించారు. ఉత్తరప్రదేశ్, బీహార్, ఢిల్లీ రాష్ట్రాల్లో ఈ పరీక్షా పత్రాన్ని ఏకంగా రూ. 2.25 లక్షలకు అమ్ముకున్నారని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు.

విద్యా వ్యవస్థపై ఆందోళన

ప్రభుత్వ పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ ఘోరంగా విఫలమైందని, దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని రాహుల్ గాంధీ మండిపడ్డారు. పేపర్ లీకేజీలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని, విద్యా వ్యవస్థను అవినీతిమయం చేస్తున్నారని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఇప్పటికే నీట్ పరీక్ష వివాదం దేశాన్ని కుదిపేస్తుండగా, ఇప్పుడు యూజీసి – ఎన్ఈటీ పేపర్ లీక్ ఆరోపణలు తోడవడంతో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై విద్యార్థి సంఘాలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.


# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సర్కార్ కీలక ప్రకటన

న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్): రాష్ట్రవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు వేదికగా ఒక తీపి కబురు అందించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఇవాళ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది విద్యార్థుల ఫీజుల చెల్లింపుపై కీలక ప్రకటన చేశారు. రాబోయే ఆగస్టు 15 లోపు ఈ ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పూర్తిగా విడుదల చేస్తామని కోర్టుకు విన్నవించారు. కేవలం పాత విద్యార్థులకే కాకుండా, ఈ ఏడాది కొత్తగా చేరిన అడ్మిషన్లకూ కూడా ఫీజులను చెల్లిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రస్తుతం వివిధ కోర్సుల్లో 2వ, 3వ, 4వ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులందరికీ కూడా ఫీజులు వర్తింపజేస్తూ నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం తరఫు న్యాయవాది హైకోర్టు ధర్మాసనానికి వివరించారు.

సుమారు రూ.1,000 కోట్లు కావచ్చు..

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఈ ఏడాది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని లెక్కిస్తే సుమారు రూ.1,000 కోట్ల వరకు ఉండవచ్చని కోర్టుకు తెలిపారు. రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం ఇచ్చిన స్పష్టమైన గడువు ప్రకటనతో ఫీజులు రాక కాలేజీల్లో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఊరట లభించినట్లైంది.

# మహారాష్ట్రను వణికించిన వరుస ప్రకంపనలు




న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్): మహారాష్ట్రలోని మరాఠ్వాడ ప్రాంతంలో తెల్లవారుజామున వరుస భూప్రకంపనలు సంభవించాయి. రాష్ట్రంలోని నాందేడ్, హింగోలి, పర్భణీ జిల్లాల్లో ఒకేసారి భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గాఢ నిద్రలో ఉన్న జనం ఒక్కసారిగా ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. అధికారుల సమాచారం ప్రకారం.. తెల్లవారుజామున సరిగ్గా 4.40 గంటల సమయంలో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 4.5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. హింగోలి జిల్లాలోని జామ్‌గిరి గ్రామం సమీపంలో భూ అంతర్భాగంలో 10 కి.మీ లోతున భూకంప కేంద్రం ఉన్నట్లుగా గుర్తించారు.

10 నిమిషాల వ్యవధిలోనే మరోసారి..

అర్ధరాత్రి దాటాకా మొదటి భూకంపం 1.29 గంటల సమయంలో రాగా, తెల్లవారుజామున 4.50 గంటల సమయంలో మరో చోట భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. అయితే, రిక్టర్ స్కేలుపై ఆ ప్రకంపనల తీవ్రత 3.6గా నమోదైది. నాందేడ్ నగరంతో పాటు జిల్లాలోని ముద్ఖేడ్, నాయిగావ్, బిలోలి, ఉమ్రి తదితర ప్రాంతాల్లో భూమి స్పష్టంగా కదలడంతో పాత్రలు, కిటికీలు శబ్దాలు చేశాయి. పర్భణీ జిల్లాలో కూడా కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. అయితే,ఈ వరుస భూప్రకంపనల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# నిరుద్యోగులకు బిగ్ అలర్ట్.. ఆర్టీసీలో

## 1500 కండక్టర్ పోస్టులకు లైన్ క్లియర్



న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) తీపి కబురు అందించింది. సంస్థలో ఖాళీగా ఉన్న 1,500 కండక్టర్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చాలా ఏళ్ల తర్వాత ఈ ఖాళీల భర్తీ జరుగుతుండటంతో, ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా ఈ నియామక ప్రక్రియను చేపట్టనుంది. అయతే, ఈ పోస్టులకు ఎలాంటి రాతపరీక్ష నిర్వహించడం లేదు. కేవలం పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. గతంలో హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో పెరిగిన రద్దీ దృష్ట్యా తాత్కాలికంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని వాడుకోగా.. ఇప్పుడు రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం రీజియన్ల వారీగా పర్మనెంట్ ఉద్యోగాలుగా వీటిని భర్తీ చేయనున్నారు.

నోటిఫికేషన్ విడుదలకు ఒకే ఒక్క అడ్డంకి..

ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చే ముందే ఓ చిన్న సాంకేతిక చిక్కును వీడదీయాల్సి ఉంది. గతంలో ఎస్ఎస్‌సీ బోర్డు మార్కుల విధానాన్ని అమలు చేయగా.. ఆ తర్వాత కొంతకాలం జీపీఏ గ్రేడింగ్ పద్ధతిని తెచ్చారు. మళ్లీ ఇటీవల మార్కుల విధానాన్నే కొనసాగిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారుల్లో కొందరికి మార్కులు, మరికొందరికి గ్రేడింగ్ పాయింట్లు ఉండే అవకాశం ఉంది. ఈ రెండింటినీ సమానంగా ఎలా అంచనా వేయాలి.. గ్రేడింగ్‌ను మార్కుల శాతంలోకి ఏ విధంగా మార్చాలి? అనే విషయంపై క్లారిటీ ఇవ్వాలని ఆర్టీసీ అధికారులు ఎస్సెస్సీ బోర్డుకు లేఖ రాశారు. ఎస్ఎస్‌సీ బోర్డు నుంచి గ్రేడింగ్ లెక్కింపుపై క్లారిటీ వచ్చిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ రానుంది.

# కాళేశ్వరంపై మాటల యుద్ధం

## కేటీఆర్, హరీశ్‌కు పొంగులేటి కౌంటర్



న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్): తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు అంశం చుట్టూ జరుగుతున్న విమర్శలు ప్రతి విమర్శలు హాట్ టాపిక్ గా మారుతున్నాయి. రైతుల గోడును పట్టించుకోకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోయడం లేదని ప్రభుత్వానికి చేతకాకపోతే వారం రోజుల పాటు ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగించండి, రైతులకు నీరందిస్తామని కేటీఆర్, తనకు ఓ మూడు నెలలు నీటిపారుదల శాఖను అప్పగిస్తే కాళేశ్వరం అంటే ఏమిటో చూయిస్తానంటూ హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తాజాగా ఎక్స్ వేదికగా స్పందించిన మంత్రి.. దొంగ "తాళం చెవులు కూడా నాకే ఇవ్వండి" అన్నట్టుగా హరీశ్ రావు, కేటీఆర్‌ల కోరిక ఉందన్నారు.

అధికార రుచి చూడాలనే ఆరాటం:

బీఆర్ఎస్ పార్టీపై పట్టుకోసం బావబామ్మర్దుల ఆధిపత్య పోరు ఫామ్‌హౌస్ నుంచి కాళేశ్వరం వరకు చేరిందని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవన్న విషయం అగ్గిపెట్టె రావు, డ్రామారావులకు అర్థమైనట్టుందిన్నారు. అందుకే ఒకరు 'వారం రోజులు', మరొకరు 'మూడు నెలలు' అంటూ... కనీసం కాళేశ్వరం పేరుతోనైనా కొద్దిరోజులు అధికార రుచి చూడాలనే ఆరాటం కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. హరీష్ రావు గారూ... అధికారంలో ఉన్నప్పుడు ఏమైనా పెండింగ్ కమీషన్లు ఉన్నాయా? వాటి వసూలు కోసమేనా మూడు నెలలు ఇరిగేషన్ మంత్రి బాధ్యత ఇవ్వండి అంటున్నారు.. ఇంత పదవి వ్యామోహమా? అని ప్రశ్నించారు.

# 53 లక్షల టన్నులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్): కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణలో విఫలమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్?జోషిని కలిసి ధాన్యం కొనుగోలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గన్నీ బ్యాగులు, గోడౌన్లు లేవు. రైస్ మిల్లుల వ్యవస్థ సరిగా లేదు.. దీంతో రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉద్యమం చేసిన తర్వాత ప్రభుత్వంలో కదలిక వచ్చింది.. 2024-25 ఖరీఫ్ కాలంలో 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా ఇప్పటి వరకు కనీసం 13 శాతం కూడా పూర్తి చేయలేదని మండిపడ్డారు. రేవంత్ ప్రభుత్వానికి కేంద్రంపై నెపం వేయడం తప్ప కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు.

గత 12 ఏళ్లలో ధాన్యం కొనుగోలు చేసేందుకు నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1.16 లక్షల కోట్లు రుణాలను అందజేసిందని కేంద్ర మంత్రి తెలిపారు. 2025-26లో ధాన్యం సేకరణ కోసం రూ.37 వేల కోట్లను ఇచ్చిందన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.22,700 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి మంజూరు చేసింది.. రైతుల సమస్యల కోసం ఢిల్లీలో ధర్నా చేయాలని కేటీఆర్ పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి ధర్నాకు వస్తే నిజాలేంటో బయట పడుతాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం ఉన్నా నిధులు అందజేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. రైతుల ధాన్యం కొనుగోలు, గోడౌన్లకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే అన్నారు. ప్రజలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం ప్రతి కేజీలో 70 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది.. ఆ నిధుల ద్వారానే తెలంగాణ ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తోందని అన్నారు.

# భగీరథ్‌కు హైకోర్టు బెయిల్

## పోక్సో కేసులో ఊరట

మొదటి పేజీ తరువాయి




అంతకుముందు పరీక్షలు రాసేందుకు లోయర్ కోర్టు వారం రోజుల పాటు తాత్కాలిక (ఇంటరిమ్) బెయిల్ ఇవ్వగా.. గడువు ముగిసిన తర్వాత ఆయన జూన్ 25న తిరిగి జైలులో లొంగిపోయారు. ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

మే 16న అరెస్ట్..

మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు బండి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే దర్యాప్తు చేపట్టిన సైబరాబాద్ పోలీసులు మే 16వ తేదీన భగీరథను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. అప్పటి నుంచి ఆయన చర్లపల్లి కేంద్ర జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసులో దాదాపు 49 రోజులకు పైగా జైలు శిక్ష అనుభవించిన తరుణంలో, పోలీసుల దర్యాప్తు కూడా ముగింపు దశకు చేరినందున బెయిల్ మంజూరు చేయాలని భగీరథ్ తరఫు సీనియర్ న్యాయవాదులు కోర్టును కోరారు. కాగా, నిందితుడికి బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందంటూ బాధితురాలి తరఫు న్యాయవాదులు, ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. హైకోర్టు నిబంధనలతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

# పవన్ కల్యాణ్‌కు చికిత్స

## నేడు ముంబైకి ఏపీ డిప్యూటీ సీఎం

న్యూస్ డెస్క్, 09 జూలై (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భుజాలకు సంబంధించిన చికిత్స కోసం రేపు అనగా శుక్రవారం రోజు ముంబైకి వెళ్లనున్నారు. కొంతకాలంగా ఆయన రొటేటర్ కఫ్ గాయంతో బాధపడుతున్నట్లు సమాచారం. రెండు భుజాల కండరాలు దెబ్బతినడంతో అసౌకర్యం ఎదుర్కొంటున్న ఆయన, ముంబైలోని కోకిలాబెన్ ధీరూబాయ్ అంబానీ హాస్పిటల్‌లో ఇప్పటికే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం వెంటనే చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు తెలిసింది. ఇక, చికిత్స పూర్తయిన తరువాత కొద్ది రోజులపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో ఆయనకు చికిత్స పూర్తైయిన తర్వాత అధికారిక కార్యక్రమాలకు తాత్కాలికంగా విరామం ఇవ్వనున్నట్లు సమాచారం.

అయితే, గత ముంబై పర్యటనలో కొన్ని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్.. ఆ తర్వాత కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు కూడా చేయించుకున్న విషయం విదితమే.. పవన్ 2 భుజాలను పరీక్షించిన వైద్యులు.. రొటేటర్ కఫ్ గాయంతోపాటు భుజానికి సంబంధించిన రెండు కండరాల్లో గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నట్టు నిర్ధారించారట.. వెంటనే శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి ఉంటుందని సూచించారు.. అయితే, ముందుగానే నిర్ణయించిన పలు పాలనాపరమైన, అధికారిక కార్యక్రమాలు ఉండడంతో.. కాస్త గ్యాప్ తీసుకున్న పవన్ కల్యాణ్.. ఇప్పుడు చికిత్స చేయించుకోవడానికి ముంబై వెళ్లనున్నారు.

# కాంగ్రెస్ పని అయిపోయింది..

## సర్వేల్లో బీఆర్ఎస్‌కు 78 సీట్లు ఖాయం

మొదటి పేజీ తరువాయి



సర్వేల ఫలితాలు.. బీఆర్ఎస్ ప్రభంజనం

ఇదే సమావేశంలో పలు సర్వేల వివరాలను కేటీఆర్ ప్రస్తావించారు. ఆ వివరాలు ప్రకారం.. ముఖ్యమంత్రి చేయించుకున్న సొంత సర్వే ప్రకారం.. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే భారత రాష్ట్ర సమితి సుమారు 78 సీట్లను కైవసం చేసుకుని అత్యంత సులభంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తేలిందన్నారు. కేవలం సీఎం సొంత సర్వేలోనే కాకుండా.. రెండు ప్రముఖ మీడియా సంస్థలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇంటెలిజెన్స్ విభాగాలు క్షేత్రస్థాయిలో చేసిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే పచ్చి నిజం వ్యక్తమైందని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పాలన కుంటుపడిందని, మరోసారి ప్రజలంతా కేసీఆర్ ని ముఖ్యమంత్రిగా చూడాలని బలంగా కోరుకుంటున్నారని అన్ని సర్వే నివేదికలు తేల్చిచెప్పాయని కేటీఆర్ వివరించారు.

సర్వేల భయంతోనే సీఎం అడ్డగోలు మాటలు

సగం పరిపాలనా కాలం ముగిసేసరికే ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ విమర్శించారు. సొంత సర్వేతో పాటు మిగతా అన్ని నివేదికల్లోనూ వ్యక్తమైన ఈ ఊహించని ప్రజా వ్యతిరేకతను చూసి తట్టుకోలేకనే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత వారం రోజులుగా తీవ్ర నిరాశతో, అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పతనాన్ని ఆపడం ఎవరి వల్లా కాదని ఆయన జోస్యం చెప్పారు.

# చందానగర్ నుండి మియాపూర్ వరకు విద్యార్థుల భారీ ర్యాలీ




చందానగర్: తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా కెజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని వామపక్ష విద్యార్థి సంఘాలు ( AIFDS--AISF--SFI) ప్రకటించాయి. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ నేడు చందానగర్‌లోని దీప్తి శ్రీనగర్ నుండి మియాపూర్ ఆల్విన్ ఎక్స్ రోడ్ వరకు విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, మహిళా విద్యార్థుల భద్రత వంటి అనేక సమస్యలు పేరుకుపోయినా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు.


ర్యాలీలో పాల్గొన్న AIFDS రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని పట్టించుకోకుండా ప్రైవేట్ విద్యాసంస్థల కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలలను తగ్గించే ఆలోచనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ప్రత్యేక విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.

AIFDS AISF, SFI జిల్లా నాయకులు ముత్తేన్నగారి శ్రీకాంత్, ధర్మతేజ బ్యాగరి అరుణ్, మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను పరిరక్షించడం, విద్యార్థుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ ర్యాలీలో AIFDS రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి, AIFDS జిల్లా నాయకులు ముత్తన్నగారి శ్రీకాంత్, అరుణ్, AISF నాయకులు ధర్మా, తేజ, నితీష్, SFI ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, నాయకులు మాల చందు, సాయి కిరణ్, రేవంత్. రంగారెడ్డి జిల్లా నాయకులు అరుణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అలాగే AIFDS గ్రేటర్ హైదరాబాద్ కమిటీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, జె.డి. గణేష్, శ్రీరామ్, దుర్గాప్రసాద్ తదితరులతో పాటు భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

## విగ్రహాల ప్రతిష్టాపన లో పాల్గొన్న గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి గారు



శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి తండాలో గల బృందావన్ కాలనీలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆంజనేయ స్వామి, శివాలయం, నాగదేవత, నవగ్రహాల విగ్రహ ప్రతిష్టాపనలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో ఈరోజు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన దేవాలయాల నిర్మాణం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరిలో దైవభక్తిని పెంపొందించేందుకు నూతన దేవాలయాల నిర్మాణం ఎంతో ఆవశ్యకమని అన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి, సామాజిక ఐక్యతకు కేంద్రబిందువులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గచ్చిబౌలి డివిజన్‌లో ఆధ్యాత్మిక, సామాజిక అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు నిర్వహించిన ఈ మహోత్సవాన్ని అభినందిస్తూ, శ్రీ ఆంజనేయ స్వామి, పరమేశ్వరుడు, నాగదేవత, నవగ్రహాల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు గంగాధర్ రెడ్డిగారిని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్,సుమన్, రంగస్వామి,దేవాలయ కమిటీ సభ్యులు,కాలనీ పెద్దలు, ప్రజాప్రతినిధులు,మహిళలు,యువకులు,పిల్లలు,మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో వీబీజీ--రాంజీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

## - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**వీబీజీ--రాంజీ పథకంపై అధికారులకు అవగాహన కల్పించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధులు**



నెల్లూరు జిల్లా కలక్టరేట్(బిఎన్ఎస్):- కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వీబీజీ--రాంజీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) పథకంపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్లు, టెక్నికల్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, వీబీజీ--రాంజీ పథకాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, గ్రామీణ ప్రజలకు పథకం ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.అదేవిధంగా

ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డైరెక్టర్ ఎం. రాజేశ్వరి పాల్గొని వీబీజీ--రాంజీ పథకంలోని ముఖ్యాంశాలు, ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మార్పులపై సిబ్బందికి వివరించారు. పథకం అమలుకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించి, సిబ్బంది అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.

కార్యక్రమంలో ముందుగా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సి.ఎస్. శ్రీనివాస్ ప్రసాద్ జిల్లాలో వీబీజీ--రాంజీ పథకం అమలు తీరును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇషా, సెక్షన్ ఆఫీసర్ ఆషా వహనే, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గేదెలను ఢీకొని అదుపు తప్పి పంట కాలువలో పడిన కారు




నెల్లూరు జిల్లా పొదలకూరు(బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం వనంతోపు సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అల్లూరు నుండి ఆదూరుపల్లికి వెళుతున్న ఓ కారు గేదెలను ఢీకొనడంతో, అదుపు తప్పి, పక్కనే ఉన్న పంట కాలువలో బోల్తా పడింది...

ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు , కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు .

# కమలాపురంలో రైళ్ల నిలుపుదలపై కదం తొక్కిన ప్రజలు..!!




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 09:

కడపజిల్లా.. కమలాపురం పట్టణ కేంద్రంలో రైళ్ల నిలుపుదల కోసం యువత సామాన్య ప్రజలు మీడియా ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీని కొనసాగించారు. స్థానిక రైళ్ల నిలుపుదల సాధన కమిటీ అధ్యక్షతన యువత,ప్రజలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపం నుంచి ప్రారంభమైన ఈ నిరసన భారీ ర్యాలీ కమలాపురం రైల్వే స్టేషన్ వరకు భారీగా కొనసాగించారు. కుల మత పార్టీ లకు అతీతంగా ఏర్పాటు చేసిన ఈ ర్యాలీలో అన్ని పార్టీల వర్గాలు, సామాన్య ప్రజలు యువత, వ్యాపారులు రైతులు, విద్యాసంస్థల యజమాన్యాలు, కళాశాల యజమాన్యాలు, ఉద్యోగులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వేలాదిగా స్వచ్ఛందంగా పాల్గొని ముక్తకంఠంతో నిరసన సెగనువినిపించారు. కమలాపురంలో రైలు నిలపండి, అది ప్రజల హక్కు. కమలాపురానికి న్యాయం చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉద్యమ గళం ఢిల్లీ వరకు వినిపించేలా డిమాండ్ చేశారు. అనంతరం కమిటీ సభ్యులు కమలాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుని స్టేషన్ మాస్టర్ శశిధర్కు వినతిపత్రం సమర్పించారు. కరోనా కాలానికి ముందు కమలాపురం రైల్వే స్టేషన్‌లో ఆగిన పలు రైళ్లకు తిరిగి నిలుపుదల కల్పించాలని, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

కమిటీసభ్యులు,మాట్లాడుతూ, రైళ్ల నిలుపుదల లేక విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కమలాపురం మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాల వేలాది మంది ప్రజలకు ఈ స్టేషన్ కీలకమని, రైళ్ల నిలుపుదల పునరుద్ధరిస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కమలాపురం ప్రజల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రజల మద్దతుతో పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తామని రైళ్ల నిలుపుదల సాధన కమిటీ స్పష్టం చేసిందని తెలిపారు..

# ఎలినినో ఎఫెక్ట్ దృష్ట్యా పంటల మార్పిడి తప్పనిసరి - జిల్లా కలెక్టర్




నల్లగొండ (బిఎన్ఎస్): జిల్లాలో రైతులు సంప్రదాయ వరి సాగుకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల వైవిధ్యం వైపు మొగ్గు చూపాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు.. జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన, నాబార్డ్, బ్యాంకింగ్, పరిశ్రమలు, డీఆర్డీఓ మరియు సహకార శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది ఎలినినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని, ఇందుకోసం మండలాల వారీగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించి, 'నానో యూరియా' వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎరువుల కంపెనీలకు సూచించారు.. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను జోడించాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాతావరణ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేసేలా ప్లానింగ్ చేయాలన్నారు.

# 14 న జమ్మలమడుగు కు మంత్రి లోకేష్




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 09:

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 14 న జమ్మలమడుగు రానున్నారు. ఈ మేరకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కు అందిన సమాచారం. 14 రాత్రికి లోకేష్ జమ్మలమడుగులో బస చేయనున్నారు. 15 న ఉదయం జమ్మలమడుగు సమీపంలోని చిన్నకొమెర్ల ప్రాంతంలో దాల్మియా సిమెంట్ ప్లాంట్ 2 పరిశ్రమ విస్తరణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం మైదుకూరు, ఆళ్లగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో పాల్గొని తిరుగు ప్రయాణం అవుతారు.

# ఏపీ రాష్ట్రంలో మళ్లీ కరోనా కలకలం.. ఇద్దరు మృతి!



ఏపీ రాష్ట్రంలో కరోనా కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు వైరస్ బారినపడి మంగళవారం మృతి చెందారు. మృతుల్లో ఒకరికి 43 ఏళ్లు, మరొకరికి 60 ఏళ్లపైనే ఉన్నాయని తెలిసింది. మృతులిద్దరికీ ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లో పాజిటివ్ అని తేలడంతో తదుపరి నిర్ధారణ పరీక్ష కోసం వారి బ్లడ్ శాంపిళ్లను పుణె వైరాలజీ ల్యాబ్‌కు పంపడానికి కడప జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 43 ఏళ్ల వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృత్యువాత పడగా.. 60 ఏళ్లు పైబడిన వ్యక్తి తమిళనాడులోని సీఎంసీ వెల్లూరులో చికిత్స పొందుతూ మరణించారు.ఈ ఘటన పై మరింత సమాచారం తెలియాల్సి ఉంది

# కడప సమాచార పౌర సంబంధ శాఖ ఏడీగా బాధ్యతలు స్వీకరించిన రమేష్..!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 09:

సమాచార పౌర సంబంధాల శాఖ వైఎస్ఆర్ కడపజిల్లా సహాయ సంచాలకులు ఏడిగా ఏ. రమేష్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఒంగోలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డిపిఆర్వోగా భాద్యతలు నిర్వహించిన ఆయన.. పదోన్నతి పొంది అదే శాఖలో కడప ఏడిగా అధికార బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎడి రమేష్ మాట్లాడుతూ.. పదోన్నతిపై ఈ జిల్లాలో ఏడీగా బాధ్యతలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వారి సలహాలు, సూచనలు పాటిస్తూ. శాఖా పరంగా, జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యాలయంలో ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలో భాగస్వామ్యులే అని, ప్రభుత్వ ఆదేశాలు, ఆశయాలకు అనుగుణంగా, కార్యాలయ నియమ నిబంధనలకు గౌరవిస్తూ. అందరూ కలిసికట్టుగా స్నేహపూర్వక వాతావరణంలో కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చాలని ఆయన సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా డీఇఇఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా తదితరులు నూతన ఏడి కి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, కృపాకర్, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, అజ్మతుల్లా, టీఏ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ జాబితా తొలగింపు ఉత్తర్వులను రైతులకు అందించిన ముఖ్యమంత్రి

బనగానపల్లె ,బిఎన్ఎస్ జూలై 9 :- నంద్యాల పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వందలాది రైతులకు ఊరట కలిగించారు. వేలాది ఎకరాలను 22-ఏ నుంచి విముక్తి కలిగించారు. అలాగే మరో 100 ఎకరాలను చుక్కల భూమి జాబితా నుంచి తప్పించారు. మూడు నెలల క్రితం తన దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించాలని గతంలోనే అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు.. రాష్ట్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలను చేపట్టారు. నంద్యాల పర్యటనలో భాగంగా జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన ప్రక్రియను దగ్గరుండి చేయించి.. చిక్కుల్లో ఉన్న భూములకు విముక్తి కల్పించి... రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. సీఎం చంద్రబాబు గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. ఈ పర్యటన సందర్భంగా మూడు నెలల క్రితం డోన్ పర్యటనలో తనను కలిసిన బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామ రైతులను బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించుకున్నారు. ఈ ఏడాది మార్చి 9వ తేదీన డోన్ పర్యటన సందర్భంగా గుటుపల్లి రైతులు సీఎం చంద్రబాబును కలిసి తమకు చెందిన భూములను 22-ఏ జాబితాలో కలిపారని... వాటికి విముక్తి కల్పించాలని కోరారు. మూడు నెలల క్రితం తాను స్వీకరించిన అర్జీని పరిశీలించి పరిష్కరించమని ఆదేశించానని.. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలను చేపట్టామని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన బేతంచర్ల రైతులతో ముఖ్యమంత్రి చెప్పారు.

సదురు భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించే ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ముఖ్యమంత్రి జిల్లా రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి తనకు అధికారిక తొలగింపు ఉత్తర్వులు ఇంకా అందకపోవడంతో ఆన్‌లైన్ తొలగింపు ప్రక్రియ ప్రారంభం కాలేదని జిల్లా రిజిస్ట్రార్ వివరించారు. దీంతో ముఖ్యమంత్రి సమక్షంలో జిల్లా కలెక్టర్ తొలగింపు ఉత్తర్వులను జిల్లా రిజిస్ట్రార్‌కు అందజేశారు... వాటిని స్వీకరించిన జిల్లా రిజిస్ట్రార్ త్వరలోనే ప్రక్రియను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి చెప్పారు. త్వరలో కాదు ఇప్పుడే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు రావడంతో అక్కడిక్కడే జిల్లా రిజిస్ట్రార్ సంబంధిత భూములను 22ఏ నుంచి తొలగించారు. దీంతోపాటు.. మరో అర్జీని క్లియర్ చేశారు. బనగానపల్లెకు చెందిన 101 ఎకరాలను కూడా చుక్కల భూమి జాబితా నుంచి జిల్లా రిజిస్ట్రార్ తప్పించారు. ఈ భూములకు విముక్తి కలగడంతో బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతులకు ఊరట లభించింది. ఈ రైతులకు చెందిన 2,074 ఎకరాలు 22-ఏ నుంచి విముక్తి పొందాయి. అలాగే బనగానపల్లెకు చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి బయటపడ్డాయి. ఈ మేరకు సదురు భూములను 22-ఏ నుంచి విముక్తి కల్పించామన్న ఉత్తర్వులను ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు అందించారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన వ్యవసాయ భూముల్ని వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చడంతో వ్యవసాయ రుణాలు పొందలేక, రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక, ఇతర భూ లావాదేవీలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని రైతులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. తమ సమస్య ఇంత త్వరగా పరిష్కారం అవుతుందని తాము ఊహించలేదని... అది స్వయంగా ముఖ్యమంత్రి ఈ తరహాలో చొరవ చూపుతారని తాము ఊహించ లేదని రైతులు చెప్పారు. తమ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు వివరించారు.

# సినిమా న్యూస్

## ‘మన్మధ’ రీ-రిలీజ్




శింబు హీరోగా, జ్యోతిక హీరోయిన్‌గా నటించిన రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్ ‘మన్మధ’. 2004లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఘన విజయాన్ని అందుకుంది. తమిళంలో ‘మన్మధన్’ పేరుతో రూపొందిన ఈ సినిమాను తెలుగులో ‘మన్మధ’ పేరుతో విడుదల చేయగా, కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాను జూలై 18న ఆంధ్రప్రదేశ్, నైజాం ప్రాంతాల్లో రీ-రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే పలు డబ్బింగ్ చిత్రాలు రీ-రిలీజ్‌లో తెలుగు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించాయి. మరి ‘మన్మధ’ కూడా అదే జాబితాలో చేరుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఏ.జె. మురుగన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి శింబు స్వయంగా స్క్రీన్‌ప్లే అందించగా, యువన్ శంకర్ రాజా సంగీతాన్ని సమకూర్చారు.

## ‘రాపో23’ సినిమాలో సంయుక్త మీనన్



టాలీవుడ్ క్రేజీ బ్యూటీ సంయుక్త మీనన్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా మారారు. బ్యాక్ టు బ్యాక్ షూటింగులలో పాల్గొంటూ బిజీ షెడ్యూల్స్ కారణంగా ఈ మధ్య కాలంలో ఆమె సోషల్ మీడియాకు కూడా కాస్త దూరం అయ్యారు. ప్రస్తుతం ఆమె బెంజ్, స్లమ్ డాగ్, స్వయంభూ వంటి భారీ చిత్రాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీ ‘బ్లాక్ గోల్డ్’ వంటి విభిన్నమైన ప్రాజెక్ట్‌తో ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా, ఈ అమ్మడు ఖాతాలోకి మరో బంపర్ ఆఫర్ వచ్చి చేరినట్లు సమాచారం. ఉస్తాద్ రామ్ పోతినేని స్వయంగా దర్శకత్వం వహించబోతున్న చిత్రం ‘రాపో-23’ లో సంయుక్త మీనన్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. నిజానికి ఇన్నాళ్లు ఈ పాత్ర కోసం నివేదా పేతురాజ్ పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ, ఆమె డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో మూవీ మేకర్స్ సంయుక్త వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే చిత్రబృందం ఆమెను సంప్రదించగా, కథ నచ్చడంతో సంయుక్త కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన కూడా రాబోతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ సినిమాతో రామ్ పోతినేని నటుడిగానే కాకుండా మొదటిసారి దర్శకుడిగా ఒక సరికొత్త సాహసం చేయబోతుండటంతో ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ చిత్రాన్ని ఒక మైండ్ బ్లోయింగ్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో రూపొందించాలని రామ్ ప్లాన్ చేస్తున్నారట. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై నిర్మాత కృష్ణ పోతినేని ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని పాన్-ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ రామ్ సీఎస్ సంగీతాన్ని అందిస్తున్నారు. అయితే టాలీవుడ్‌లో గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న సంయుక్త మీనన్ ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంట్రీ ఇస్తుందనే వార్త బయటకు రావడంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు, రామ్ అభిమానులు.. సంయుక్త లక్ కారణంగా ఈసారి రామ్ ఖాతాలో గ్యారెంటీగా బ్లాక్‌బస్టర్ హిట్ పడటం ఖాయమని అంటున్నారు.



## అశ్లీల పోస్టులు ఉండవ్

దేశ వ్యాప్తంగా అనేకమంది సెలబ్రిటీలు ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేకంగా సబ్‌స్క్రిప్షన్ ఫీచర్‌ను ప్రారంభించి ఆదాయం పొందుతున్నారు. నటి నందిత శ్వేత ఈ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించినప్పుడు, నెటిజన్లు కొందరు ఆమెను ట్రోల్ చేయగా.. అది కేవలం ఒక ఆప్షన్ మాత్రమేనని ఆమె గట్టిగానే సమాధానమిచ్చింది. ఇప్పుడు ఇదే బాటలో, ఈ ఏడాది పాయల్ రాజ్‌పుత్ కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యేకంగా సబ్‌స్క్రిప్షన్ పేజీని ప్రారంభించింది. అయితే, తన సబ్‌స్క్రిప్షన్ పేజీలో ఎలాంటి అశ్లీల లేదా బోల్డ్ కంటెంట్ పోస్ట్ చేయనని, అలాంటివీ ఆశించి ఎవరైనా వస్తే ఇప్పుడే వెళ్ళిపోవచ్చుంటూ ఆమె తాజాగా ఒక ఘాటైన పోస్ట్ పెట్టింది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో 4 మిలియన్ల ఫాలోవర్లు..**

ఢిల్లీలో పుట్టి పెరిగిన పాయల్ రాజ్‌పుత్ 2017లో ‘చన్నా మేరేయా’ అనే పంజాబీ సినిమాతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తెలుగులో వచ్చిన ‘ఆర్ఎక్స్ 100’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్, హిందీ అనే తేడాలు లేకుండా అన్ని ఇండస్ట్రీల్లోనూ రాణిస్తోంది. ఈ ఏడాది లెజెండ్ శరవణన్ నటించిన స్పై థ్రిల్లర్ చిత్రం ‘లీడర్’లో స్పైగా నటించి మెప్పించింది. ప్రస్తుతం ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో లో 4 మిలియన్ల (40 లక్షల) కంటే ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు. సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ గ్లామరస్ ఫోటోలను షేర్ చేసే పాయల్, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో స్సబ్స్క్రిప్షన్ ఫీచరను ప్రారంభించగా.. ఇప్పటివరకు 96 మంది ఆమెను సబ్స్క్రైబ్ చేసుకున్నారు. నెలకు ఒక్కొక్కరికి రూ.390 చొప్పున ప్రస్తుతం ఆమెకు నెలకు సుమారు రూ. 37,440 ఆదాయం లభిస్తోంది. త్వరలోనే ఈ సబ్స్క్రైబర్ల సంఖ్య వెయ్యి దాటుతుందని అంచనా వేస్తున్నారు.

**అలాంటి కంటెంట్ ఉండదు..**

సబ్ స్క్రిప్షన్ ప్రారంభించినప్పటి నుండి, కొందరు నెటిజన్లు ఎక్స్ క్లూజివ్‌గా బోల్డ్ లేదా అశ్లీల ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేయాలని ఆమెపై ఒత్తిడి తెస్తున్నారు. దీనికి గట్టి కౌంటర్ ఇస్తూ పాయల్ స్పందించింది. “ఎవరైనా అశ్లీల కంటెంట్ ఆశించి సబ్‌స్క్రిప్షన్ తీసుకోవద్దు. అలాంటి వాటికి ఇక్కడ చోటు లేదు. ఎలాంటి ఫిల్టర్లు లేకుండా నా నిజ జీవితాన్ని చూడాలనుకునే వారి కోసమే ఈ సబ్స్క్రిప్షన్” అని ఆమె స్పష్టం చేసింది. ఈ ప్రకటన తర్వాత ఆమె సబర్ల సంఖ్య పెరుగుతుందా లేదా తగ్గుతుందా అనేది వేచి చూడాలి.

## మైసా టీజర్ రిలీజ్ డేట్ ఫిక్స్?

మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటి రష్మిక మందన్న తన కెరీర్‌లో ఇంతకుముందెన్నడూ కనిపించని మాస్ లుక్‌లో ‘మైసా’ చిత్రంలో కనిపించనుంది. ఈ సినిమాలో ఆమె ప్రధాన పాత్ర పోషిస్తోంది. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమై చాలా రోజులైంది. చిత్రీకరణలో ఎక్కువ భాగం పూర్తైనట్లు సమాచారం. దీంతో ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ నెల 15వ తేదీన టీజర్‌ను విడుదల చేసే అవకాశముంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన మరో ఒకటి, రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే ఆ అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

